# ఎవరా పోయేదీ!



"ఎవరా పోయేదీ ......?" మొదటి ప్రాకారంలో గాలిగోపురం పక్కనుంచి ఓ ముసలి గొంతు విన్పించేది.

"నేనే నండయ్యా" తోటకూర అమ్ముకోడానికొచ్చిన అబ్బాయి సమాధానం చెప్పేవాడు.

"ఇటు రా! నాయనా!"అని సూరయ్య స్వాములవారు పిలచి "బుట్ట దింపుకో" అనేవారు. బుట్ట దింపుకున్న తర్వాత "మీది కునికినపాడేనా?" అని పరామర్శించగా "మరేనండీ! ఇప్పుడే రేవుదాటి వచ్చానండి" అని అతను బదులు చెప్పగా సూరయ్యస్వాముల వారు అతన్ని సూటిగా చూస్తూ "స్వామివారికి ఇవ్వాళ తోటకూర తినాలనుంది. నాలుగు కట్టలిచ్చుకో" అనేవారు.

అతను ఇక తప్పదన్నట్టు నాలుగు కట్ట లిస్తుంటే "మరో రెండు కట్టలిచ్చుకో ..... బేరం బావుంటుంది" అనేవారు. మరో రెండు కట్టలిచ్చుకుని అతను నీరసంగా బుట్ట తలకెత్తుకు వెళ్తుంటే "నారాయణ! నారాయణ!" అని ఆశీర్వదించేవారు.

గుళ్లోకి వెళ్ళేవాళ్ళు వచ్చేవాళ్ళు మొదటి ప్రాకారంలోంచి పోవలసిందే. అలా వచ్చిపోయేవాళ్ళెవరూ సూరయ్యస్వాములవారి పిలుపు తప్పించుకోలేరు. చిల్లరకొట్టు సుబ్బయ్య గుళ్ళోనించి తిరిగి వెళ్తున్నాడు.

"ఎవరా పోయేది ....? " స్వాములవారి పిలుపు.

సుబ్బయ్య గుండె గతుక్కుమంది. ఇక తప్పదని వెళ్ళి నమస్కారం చేసి కూర్చున్నాడు.

"వ్యాపారం బాగా సాగుతోందా? పిల్లలు బావున్నారా?" అంటూ కుశలప్రశ్నలు వేసి స్వాములవారు అసలు సంగతి బయట పెట్టారు. "స్వామి వారికి ఇవాళ గారెలు తినాలని ఉందోయ్."

సుబ్బయ్య గుండెల్లో రాయిపడింది. "ద ..... ద......దానికేముంది" అన్నాడు.

సూరయ్య స్వాములవారు ఆనందపడిపోయి "నాకు తెలుసు .... సర్వసంగ పరిత్యాగులం, మాకోరిక తీర్చటానికి నువ్వు వెనకా ముందూ ఆడ్తావా? ఓ మానెడు మినప్పప్పు, వీశెడు నూనె, మిగిలిన సంబారాలు ఇంటికి పంపించు ......... ఆ .... అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమెర కూడా పంపు .... ఆ కాస్త పుణ్యం మళ్ళీ ఇంకొకళ్ళకెందుకు దక్కాలి ....." అన్నారు.

సుబ్బయ్య గొంతులో తడి ఆరిపోయింది. కూర్చుంటే ఇంకా ఏమి మీదపడ్తాయోనని లేచి నంగి నంగిగా అన్నాడు.

"అయ్యా..... తమరు ఒక్కరే గదా! గారెలకు మానెడు పప్పు ...."

సూరయ్య స్వాములవారు నవ్వుతూ తక్కున సమాధానం చెప్పాడు. "పిచ్చివాడా .... అంతా నా ఒక్కడికేనా? స్వామివారి ప్రసాదం నలుగురూ నాలుగు ముక్కలు తింటే నీకు మరింత పుణ్యం కదుటయ్యా." సుబ్బయ్య మారు మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు.

సూరయ్యగారు సన్యాసాశ్రమం స్వీకరించిన ఉదంతం, దానిక్కారణాలు చాలా కొద్దిమందికి తెలుసు. దావాల్లో ఉన్న పొలం కాస్తా పోయింది. ఎదిగొచ్చిన కొడుకు జులాయిగా తిరగటం తప్ప సంపాదన లేదు. పైగా వాడికి పెళ్ళికూడా చేశాడు. దాని ఫలితంగా ముగ్గురు పిల్లలు; ఇంట్లో పక్కవాటా అద్దెకిస్తే వచ్చే అద్దె డబ్బు పిల్లల చద్దన్నాలకి సరిపోవటం లేదు. ఎక్కడా కాణీ అప్పు పుట్టటం లేదు. సూరయ్య కన్పిస్తే అప్పు అడుగుతాడేమోనని జనం తప్పుకు తిరుగుతున్నారు. మూడు రోజులయింది పొయ్యిలో పిల్లి లేచి. వూరు తిరిగాడు. వాడ తిరిగాడు. ఎక్కడా డబ్బు పుట్టలేదు. పిల్లలు ఆకలికి గొల్లుమంటున్నారు. పెళ్ళాం కోడళ్ళు తోటకూర కాడల్లా వాలి చెంగులు పరుచుకు పడుకున్నారు.

సంసారాన్ని చూశాడు. విరక్తి కలిగింది, ఛీ అనుకున్నాడు. ఠక్కున వెళ్ళి సన్యాసాశ్రమం స్వీకరించాడు. కాషాయం కట్టి కమండలం ధరించగానే వూరు వూరంతా వచ్చి ప్రణాచారం పడ్డారు. పాదోదకం నెత్తిన చల్లుకున్నారు. గాలి గోపురం పక్కగది ఖాళీ చేయించి స్వాములవారి కిచ్చారు. ఆనాటి నుంచీ సూరయ్యగారికిగాని, సూరయ్యగారి కుటుంబానికిగానీ చీకూ చింతా లేదు. దివ్యంగా కాలం గడచి పోతోంది.

సూరయ్యగారు భిక్షకు పిలిపించుకునే విధం చాలా హుందాగా ఉండేది.

సుబ్బరామయ్య కన్పించాడనుకోండి. ఇలా జరిగేది సంభాషణ.

"ఎవరా పోయేదీ? సుబ్బరామయ్యేనా?"

"నేనే స్వామీ, పిల్చారా?"

"కూర్చో. పంటలు బాగా పండుతున్నాయా? పెద్దమ్మాయి కాపరానికెళ్ళిందా?"

"మీ దయవల్ల అంతా సక్రమంగానే జరిగిపోతోంది ...."

"నారాయణ! నారాయణ! సుబ్బరామయ్యా! స్వామివార్ని భిక్షకు పిలిచి మూణ్ణెల్లు దాటినట్టుందే?"

"తమ సెలవయితే ......"

"ఆహ్వానించకుండా స్వామివారు భిక్షకొచ్చి అనుగ్రహిస్తారటయ్యా!"

"తమరి దయ అయితే ఈ రోజే భిక్షకు దయచేయండి."

"అలా అన్నావు బావుంది, పెద్దగా ఏర్పాట్లు ఏమీ చెయ్యకు. రెండు కూరలు రెండు పచ్చళ్ళు చాలు. నేతి తిరగమోతలు మర్చిపోబోకు. గారెలు ఎలాగూ వండిస్తావూ; తీపి పిండివంట విషయంలో పాలపూరీలు చేయించు. దంత సిరి తగ్గిపోయింది."

"అలాగే."

"పన్నెండో గంటకల్లా వచ్చేయి. ఆలస్యమయితే ఉండలేను- రాత్రి ఫలహారం సంగతి ఆనక చెప్తా."

ఇలాగే నిత్యమూ తనకి భిక్ష ఏర్పాట్లు చేసుకుంటూ కన్పించిన వాళ్ళందరిచేతా ఇంటి ఏర్పాట్లు చేయించేవారు సూరయ్యస్వాములవారు.

ఒకరోజు సీతారామయ్యగారింట్లో భిక్ష కుదిరింది. పన్నెండయి నెత్తి మాడుతున్నా సీతారామయ్య పిలుపుకు రాలేదు. కడుపులో ఆకలి మెలి తిరిగిపోతోంది. ఒంటిగంటవేళ సీతారామయ్య వచ్చి చెప్పాడు. "స్వామీ మా ఇంట్లో అశుచి వచ్చింది. ఇవ్వాళ్టికి భిక్ష కుదరదు" అని. స్వాముల వారి నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఆ మించిపోయిన వేళ ఎవరింటికి వెళ్తాడు?

నీరసంగా పావుకోళ్ళు వేసుకుని సరాసరి ఇంటికొచ్చాడు. ఇంట్లో అంతా భోజనాలు చేసి తాంబూలాలు నములుతూ పడుకుని ఉన్నారు. "భిక్ష ఎక్కడా కుదరలేదు ఇంట్లోనే" అన్నాడు సూరయ్య స్వాములవారు.

"సరి సరి! గిన్నెలు కడిగేసుకుని మేం పడుకుంటే ఇప్పుడేం భిక్ష" అంది కోడలు.

కొడుకు విని కూడా అటు తిరిగి పడుకున్నాడు.

భార్య వినీ విననట్లు పడుకుని పీటమీంచి తలెత్త లేదు. స్వాములవారికి కడుపులో మంటలు. గుండెల్లో మంటలు; సిగ్గువిడిచి భార్యతో చెప్పాడు "ఇవ్వాళ భిక్ష దొరకలేదే! ఓ ముద్ద పెట్టవే?"

భార్యలేచి కూర్చుని అంది "నాకసలే నడుంనొప్పి. నేనెక్కడ వంట చేస్తాను. ఏవే! ఓ గ్లాసు మజ్జిగ వుంటే ఇవ్వు. ఈ పూటకి సరి పెట్టుకుంటారు" అని కోడలికి చెప్పింది.

సూరయ్యగారి కింద భూమి కదిలిపోయింది. ఇదా సంసారం? ఛీ. అనుకుంటూ కాషాయ వస్త్రాలు పరపరా చింపేశాడు. కమండలం 'థాం' అని బద్దలు కొట్టాడు. దండం విరిచేశాడు. నిజమైన విరక్తితో సరాసరి కాశీ వెళ్ళి అసలైన సన్యాసం స్వీకరించాడు.

ఆరోజునుండి మొదటి ప్రాకారంలో 'ఎవరా పోయేదీ?' అన్న గొంతు విన్పించకపోతే ఏవిటో బోసిగా ఉండేది కొన్నాళ్ళు. *